AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

29-10-2025 (Wednesday) MAIN EDITION

## బీఈఎల్ నుంచి మరో నోటిఫికేషన్..



**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ నుంచి మరో నోటిఫికేషన్ విడుదలైంది. వివిధ విభాగాలలో 340 ప్రొబెషనరీ ఇంజినీర్ పోస్టుల భర్తీ కోసం ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. బీఈ, బీటెక్, బీఎస్సీ పూర్తి చేసినవారు అర్హులు. ఆన్‌లైన్‌లో నవంబర్ 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. అనంతరం ఇంటర్వ్యూ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తారు. పూర్తి వివరాలకు బీఈఎల్ అధికారిక వెబ్‌సైట్ www.belindia.in లో సంప్రదించండి.

## కోలుకుంటున్న శ్రేయస్ అయ్యర్..



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో గాయపడిన టీమిండియా క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ కోలుకుంటున్నాడు. అతడి ప్లీహానికి తీవ్ర గాయం కావడంతో ఐసీయూలో చికిత్స అందించిన విషయం తెలిసిందే. అయితే అయ్యర్‌కు ఎలాంటి ఆపరేషన్ జరగలేదని బీసీసీఐ ప్రకటించింది. వైద్యులు ఊహించిన దానికంటే అయ్యర్ త్వరగా కోలుకుంటున్నారని, ఆయన పరిస్థితి నిలకడగా ఉందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు.

## 'రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదు'



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. నీతీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటారని వ్యాఖ్యానించారు. బీహార్‌లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

## ఇది పెనువిపత్తు: చంద్రబాబు



**అక్షరటుడే, అమరావతి:** మొంథా తుపాను పెనువిపత్తని.. రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగిందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం రోడ్డుమార్గంలో వెళ్లి అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఓడలరేవులో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, తుపాను బాధితులను పరామర్శించారు.

## బలూచిస్థాన్‌లో పాక్ దాడులు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ మరోసారి ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లు ప్రారంభించింది. బలోచ్ లిబరేషన్ ఆర్మీ లక్ష్యంగా అర్ధరాత్రి వైమానిక దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో దాదాపు 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. చిల్తాన్ పర్వత ప్రాంతంలో బీఎల్ఏ ఉగ్రవాదులే లక్ష్యంగా పాక్ వైమానిక దాడులకు పాల్పడినట్లు సమాచారం.

## రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** భారత రాష్ట్రపతి, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపదీ ముర్ము రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. హర్యానాలోని అంబాలా వైమానిక స్థావరం నుంచి బుధవారం ఆమె రఫేల్ యుద్ధ విమానంలో ప్రయాణించారు. వాయుసేన చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రత్యేక్షంగా వీక్షించారు. ఆయన అదే వైమానిక స్థావరం నుంచి స్పెరేట్ విమానంలో ప్రయాణించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో రఫేల్ యుద్ధ విమానాలు కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

## భారత్ చేతిలో అఫ్గాన్ కీలుబొమ్మ: పాక్ మంత్రి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ రక్షణశాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అఫ్గానిస్థాన్‌తో ఘర్షణలపై స్పందిస్తూ.. భారత్‌పై ఆరోపణలు చేశారు. భారత్ చేతిలో అఫ్గాన్ కీలుబొమ్మగా మారిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో బుద్ధి చెప్పినా.. పాకిస్థాన్ నేతల తీరులో మార్పు రావడం లేదు. భారత వ్యతిరేక వ్యాఖ్యలతో కవ్వింపులకు పాల్పడుతున్నారు. ఓ వైపు బలూచిస్థాన్ వేర్పాటువాదులు, మరోవైపు అఫ్గానిస్థాన్ దాడులతో బిత్తరపోతున్న పాక్ ప్రభుత్వం.. ఆ నెపాన్ని భారత్‌పై నెడుతోంది. వారితో పోరాడలేక పాక్ దళాలు పారిపోతుంటే.. పాక్ మంత్రి మాత్రం ఇస్లామాబాద్‌పై దాడి జరిగితే.. దానికి 50 రెట్ల తీవ్రతతో ప్రతి దాడి చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణకు మొంథా తుపాన్ ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ తుపాన్ మంగళవారం అర్ధరాత్రి నరసాపురం దగ్గరలో తీరం దాటింది. అనంతరం తన దిశను మార్చుకొని తెలంగాణ వైపు దూసుకువస్తోంది. దీంతో రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. –అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# మొంథా ముప్పు..



- దిశ మార్చుకున్న తుపాన్
- తెలంగాణ రాష్ట్రం వైపు పయనం
- ఇప్పటికే భారీ వర్షాలతో ప్రజల ఇబ్బందులు
- పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ

తెలుగు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టించిన తీవ్ర తుపాన్ మొంథా తీరం దాటాక దిశ మార్చుకుంది. తుపాన్ బలహీనపడి తెలంగాణ వైపు పయనిస్తోంది. ప్రస్తుతం భద్రాచలానికి 50 కి.మీ, ఖమ్మంకు 110 కి.మీల దూరంలో కేంద్రీకృతం అయింది. ఉత్తరవాయువ్య దిశగా ప్రయాణించి రాబోయే రాత్రి వరకు అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఫ్లాష్ ఫ్లడ్ వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, విదర్భా ప్రాంతాలకు రాబోయే కొన్ని గంటల్లో తక్షణ వరద ముప్పు పొంచి ఉందని తెలిపింది. రాబోయే ఆరు గంటల్లో ఏపీలో, 24 గంటల్లో తెలంగాణ, విదర్భా, మరాఠ్వాడాలో తీవ్ర వర్షపాతం వల్ల వరద వచ్చే ఛాన్స్ ఉందని పేర్కొంది. తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో వానలు దంచికొడుతున్నాయి.

### పలు జిల్లాలకు అలర్ట్ జారీ

తుపాన్ దిశ మార్చుకుని తెలంగాణ వైపు వస్తుండడంతో రెండు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, జనగాం, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, పెద్దపల్లి జిల్లాలకు వర్ష సూచన చేసింది. ప్రజలు వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లొదని.. వాగులు, కాల్వలు, చెరువుల దగ్గర తిరగవద్దని హెచ్చరించింది. ప్రయాణం ముందు వాతావరణ సమాచారం తెలుసుకోవాలని సూచించింది.

### హైదరాబాద్ అతలాకుతలం

తుపాన్ ప్రభావంతో హైదరాబాద్ నగరంలో బుధవారం ఉదయం నుంచి భారీ వర్షం పడుతూనే ఉంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై నీరు నిలిచి చెరువులను తలపించాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. ముఖ్యంగా గచ్చిబౌలి, కొండాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వరద పెరగడంతో అధికారులు హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ (గండిపేట్) గేట్లను ఎత్తారు. ఉస్మాన్‌సాగర్ పది గేట్లను రెండు అడుగుల మేర, హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో మంచిరేవుల కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. పోలీసులు ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు.

### వర్షాలతో ఆగమాగం

తెలంగాణలో వర్షాకాలం సీజన్‌లో వానలు దంచికొట్టాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. పలు జిల్లాల్లో కుండపోత వాన జన జీవనం స్తంభించింది. ఆగస్టులో కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, సిద్దిపేట, సిరిసిల్లలో భారీ వర్షాలు కురిశాయి. హైదరాబాద్ నగరంలో ఇటీవల మూసీ ఉధృతికి ఓల్డ్ సిటీ నీట మునిగింది. సీజన్ మొత్తం ప్రజలు వర్షాలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రస్తుతం వానాకాలం ముగిసినా.. వర్షాలు పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రస్తుతం పంటచేతికొచ్చిన తర్వాత వర్షాలు కురుస్తుండడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## తెలంగాణ కేబినెట్‌లోకి అజారుద్దీన్!



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ విస్తరణ చేపట్టాలని యోచిస్తోంది. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేసిన అజారుద్దీన్‌కు మంత్రిగా అవకాశం కల్పించనున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రం ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. కొద్ది నెలల క్రితం మంత్రి వర్గాన్ని విస్తరించారు. ఆ సమయంలో బీసీ, ఎస్సీ, మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రి పదవులు దక్కాయి. అప్పుడే మైనారిటీలకు అవకాశం కల్పిస్తారని ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం మైనారిటీ కోటాలో అజారుద్దీన్‌కు పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

## కేటీఆర్ రోడ్ షో షెడ్యూల్ ఖరారు



**అక్షరటుడే, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రధాన పార్టీలు ప్రచారంలో జోరు పెంచాయి. ఈ స్థానంలో ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ తీవ్రంగా శ్రమిస్తున్నాయి. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ మేరకు కేటీఆర్, హరీశ్‌రావు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రచార షెడ్యూల్‌ను పార్టీ తాజాగా ఖరారు చేసింది. అక్టోబర్ 31 నుంచి నవంబర్ 9 వరకు కేటీఆర్ విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. అక్టోబర్ 31న షేక్‌పేట్, నవంబర్ 1న రహమత్ నగర్, 2న యూసుఫ్‌గూడ, 3న బోరబండ, 4న సోమాజిగూడ, 5న వెంకట్రావు నగర్, 6న ఎర్రగడ్డ డివిజన్లలో రోడ్ షోలు నిర్వహించనున్నారు. 8న షేక్‌పేట్, యూసుఫ్‌గూడ, రహమత్ నగర్ డివిజన్లలో రోడ్ షోలో పాల్గొంటారు. నవంబర్ 9న షేక్‌పేట్ నుంచి బోరబండ వరకు బైక్ ర్యాలీలో పాల్గొంటారు.

## త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "చాలా అందంగా కనిపించే వ్యక్తి" అని ప్రశంసించారు. ఆయన పట్ల తనకు చాలా గౌరవం ఉందన్నారు. అదే సమయంలో ఆయన చాలా కఠినంగా ఉంటారని పేర్కొన్నారు. భారతదేశం, అమెరికా త్వరలో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నాయని నొక్కి చెప్పారు. దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సులో (అపెక్) ట్రంప్ మాట్లాడుతూ.. "భారతదేశంతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నాం. నాకు ప్రధాని మోదీ పట్ల చాలా గౌరవం, ప్రేమ ఉంది" అని పేర్కొన్నారు.

## ఓట్ల కోసం ఏ డ్రామా అయినా చేస్తారు: రాహుల్ గాంధీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం మరోసారి నిప్పులు చెరిగారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ముజఫర్పూర్ నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎన్నికల్లో గెలవడానికి "ఏ డ్రామా" అయినా చేయగలరని ఆరోపించారు. "మోదీ జీ ఓట్ల కోసం ఏదైనా డ్రామా చేయవచ్చు. ఆయనకు మీ ఓటు మాత్రమే కావాలి. మీరు నరేంద్ర మోదీని డ్యాన్స్ చేయమని చెబితే. ఆయన డ్యాన్స్ కూడాచేస్తారని" వ్యంగ్యంగా అన్నారు.

## ఫ్యామిలీ మ్యాన్ 3 వచ్చేస్తోంది..

**అక్షరటుడే, సినిమా డెస్క్:** బాలీవుడ్ ప్రముఖ నటుడు మనోజ్ బాజ్‌పేయి, ప్రియమణి కలిసి నటించిన ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 1, 2 బంపర్ హిట్ సాధించాయి. రాజ్ డీకే జంట నిర్మించిన ఈ వెబ్ సిరీస్ సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఫ్యామిలీమ్యాన్ సీజన్ 3 త్వరలో విడుదల కానుంది. డీ2ఆర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రాజ్, డీకే జంట నిర్మించిన ఈ హైస్టేక్స్ స్పై యాక్షన్ థ్రిల్లర్, మరోసారి కొత్త ఉత్తేజకరమైన కథతో తిరిగి వస్తోంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ది ఫ్యామిలీ మ్యాన్ సిరీస్ మూడో సీజన్ విడుదలకు సిద్ధమవుతోంది. భారత దేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన వాటిలో ఒకటిగా ప్రసిద్ధి గాంచిన ఓటీటీ సిరీస్ ఫ్రాంచైజీ ది ఫ్యామిలీ మ్యాన్ సీజన్ 3 నవంబర్ 21న విడుదల కానుంది.



## మహేష్ బాబు ఫ్యామిలీ నుంచి హీరోయిన్‌గా..

**సూపర్‌స్టార్ ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసురాలు సినీ రంగంలోకి అడుగుపెట్టబోతోంది. మహేష్ బాబు మేనకోడలు, మంజుల ఘట్టమనేని – స్వరూప్ దంపతుల కుమార్తె జాన్వీ స్వరూప్ హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని తాజాగా అధికారికంగా ప్రకటించారు. జాన్వీ చిన్నప్పటి నుంచే కళారంగంపై ఆసక్తి చూపుతూ నటన, నృత్యం, పెయింటింగ్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ తదితర రంగాల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. నటిగా మారకముందే ఒక జ్యువెలరీ బ్రాండ్ ప్రకటనలో కనిపించి, తన అందం, ఆకర్షణతో అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ తర్వాత పలువురు జాతీయ స్థాయి దర్శకులు, బ్రాండ్లు ఆమెను సంప్రదించారని సమాచారం.**

- అక్షరటుడే, సినిమా డెస్క్

